విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

ధాన్యం సేకరణకు పటిష్ట ఏర్పాట్లు

జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్ రెడ్డి

విశాలాంధ్ర-భీమవరం: జిల్లాలో ధాన్యం సేకరణకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జిల్లా జాయింటు కలెక్టరు ఎస్. రామ్ సుందర్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక జిల్లా కలెక్టరు ఛాంబర్లో ధాన్యం సేకరణ పై సివిల్ సప్లై కార్పొరేషన్ జిల్లా మేనేజరు, జిల్లా రైస్ మిల్లర్స్ అధ్యక్షులతో జిల్లా జాయింటు కలెక్టరు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింటు కలెక్టరు మాట్లాడుతూ వచ్చే వారంలో ధాన్యం పంట రైతు చేతికి వస్తుంది కాబట్టి ఖరీఫ్ సీజనులో ధాన్యం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని, అందుకు అనుగుణంగా జిల్లా రైస్ మిలర్లు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అందులో భాగంగా మిల్లర్లు అవసరమైన గోనె సంచులు, బ్యాంకు గ్యారంటీలు ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. గత రబీ పంట కాలంలో మిల్లర్లు, కస్టమ్ మిల్లింగు రైస్ సుమారుగా 52వేల మెట్రిక్ టన్నులు ప్రభుత్వానికి ఇవ్వవలసి ఉన్నందున వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే అన్ని ఆర్ బి కెలో ధాన్యం కొనుగోలుకు కావలసిన మెటీరియల్ అందజేసినట్టు తెలిపారు. రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు కేంద్రాలకు వచ్చేలా స్నేహపూరిత వాతావరణంలో అధికారులు, సిబ్బంది పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో సివిల్ సప్లై కార్పొరేషన్ జిల్లా మేనేజరు టి.శివ రామ ప్రసాదు, ఏయస్‌వో యం. రవి శంకర్,జిల్లా రైసు మిల్లర్స్ అధ్యక్షులు సామంతపూడి శ్రీరామరాజు, తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగనిరతి మహోన్నతం

జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: తెలుగు రాష్ట్ర ప్రగతికి అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగనిరతి చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ ప్రశాంతి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు భీమవరం కలెక్టరేట్ ఆవరణలో బుధవారం కనులపండుగగా జరిగాయి. తొలుత జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరించి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ యు. రవి ప్రకాష్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. రామ్ సుందర్ రెడ్డి, జిల్లా అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు, మహాత్మాగాంధీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వేడుకలను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డితో కలిసి జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం అమరజీవి పొట్టిశ్రీరాములు చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. రామ్ సుందర్ రెడ్డి, జిల్లా అధికారులు పుష్పమాలలతో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు వంటి మహనీయుల త్యాగఫలితమే భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవించిందని అన్నారు. ఆయన చేసిన ప్రాణ త్యాగం వలన ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందన్నారు. త్యాగధనుల స్ఫూర్తితో అధికారులు ప్రజలకు ఉత్తమమైన సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పి యు.రవి ప్రకాష్, జిల్లా ఏయస్పి ఏవి సుబ్బరాజు, జిల్లా రెవిన్యూ అధికారి కె. కృష్ణవేణి, ఆర్డీవో కె. శ్రీనివాసులు రాజు, డిఎస్పీ బి.శ్రీనాథ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, జిల్లాలోని వివిధ శాఖలు అధికారులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగు

విశాలాంధ్ర-టి నరసాపురం: రాష్ట్రంలో జగన్మోహనరెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలతో పేదల జీవితాల్లో వెలుగు నింపారని పోలవరం శాసన సభ్యుడు తెల్లం బాలరాజు తెలిపారు.గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తిరుమల దేవిపేట గ్రామంలో బుధవారం గడప గడప కు వెళ్ళి ప్రజా సమస్యలు అడిగి తెలుసు కుంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు నేరుగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ఘనత జగన్మోహనరెడ్డికే దక్కుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు, ఎంపీపీ డి. లక్ష్మి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ శ్రీను రాజు, తదితరులు పాల్గొన్నారు.

సర్వే శాఖ నూతన కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర-భీమవరం: జిల్లా సర్వే శాఖ డేటా ప్రాసెసింగు సెంటర్ నూతన కార్యాలయాన్ని జిల్లా కలెక్టరు పి. ప్రశాంతి ప్రారంభించారు. బుధవారం స్థానిక జిల్లా కలెక్టరేటు మొదటి అంతస్తు వీడియో కాన్ఫరెన్స్ హాలు ప్రక్కన జిల్లా సర్వే శాఖ డేటా ప్రాసెసింగు సెంటరు నూతన కార్యాలయాన్ని జిల్లా జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్‌రెడ్డితో కలసి జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ రీ సర్వే రికార్డులను అత్యంత వేగవంతంగా చేయడానికి ఈ నూతన కార్యాలయంను ఉపయోగించనునట్లు ఆమె తెలిపారు. డేటా ప్రాసెసింగు సెంటరుకు 20 మంది సిబ్బందిని డిప్యూటేషన్ పై నియమించామని, పనులు వేగవంతం చేసి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టరు ఎస్.రామ్‌సుందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, ఆర్డీవో కె. తదితరులు పాల్గొన్నారు.

తారకరామ కన్‌స్ట్రక్షన్స్ వైస్ చైర్మన్‌గా తారకరామ

విశాలాంధ్ర-భీమవరం టౌన్ : తారకరామ కన్‌స్ట్రక్షన్స్ వైస్ చైర్మన్ గా పళ్ళ తారకరామ నంద బాధ్యతలు చేపట్టి నట్లు చైర్మన్ పళ్ళ ఏసుబాబు తెలిపారు.

బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వైస్ చైర్మన్ తారక రామనంద మాట్లాడుతూ విస్సాకోడేరు జగనన్న లే అవుట్ లో లబ్ధిదారులు వేగవంతంగా గృహ నిర్మాణాలు జరుపు కుంటున్నారని, పట్టణంలో మిగిలిన లబ్దిదారులకు గృహ నిర్మాణలపై అవగాహన కల్పించడానికి ప్రత్యేకంగా తమ కన్‌స్ట్రక్షన్ తరపున రూ.15 లక్షలతో ఏర్పాటుచేసిన విజయ భేరి వాహనాన్ని తయారు చేశామని తెలిపారు. ప్రతి వార్డులో కూడా ఈ వాహనాన్ని హౌసింగ్ లబ్దిదారుల అవగాహన కోసం వినియోగించనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చేతుల మీదుగా ఈనెల 6న ఈ విజయభేరి వాహనాన్ని ప్రారంభిస్తామన్నారు. కాలనీలో గృహాలు నిర్మించుకునే లబ్ధిదారులకు రవాణా ఛార్జీలు లేకుండా తాము ఏర్పాటు చేసిన వాహనం ద్వారా వారికి పట్టణం నుంచి ఈ లే అవుట్ వరకు రవాణా సదుపాయాన్ని ఉచితంగా కల్పిస్తున్నామన్నారు. విస్సాకోడెరు లే అవుట్ లో 4, వేల 600 గృహాలకు సంబంధించి 2 వేల గృహ నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు.

గ్రామ, వార్డు సచివాలయాల పర్యవేక్షణ అధికారిగా సుబ్బారావు

విశాలాంధ్ర-ఏలూరు: గ్రామ,వార్డు సచివాలయాల పర్యవేక్షణకు జడ్పీ సీఈవో కె.ఎస్.ఎస్.సుబ్బారావును నోడల్ అధికారిగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఈ విధులు నిర్వర్తించిన ఏలూరు డిఎల్‌డివో జి.రమణ విజయవాడ లోని ఏపీఎస్ఐఆర్ డి, పిఆర్ డిపార్ట్మెంట్‌లో డిప్యూటీ డైరెక్టర్ గా నియమితులైన కారణంగా వారి స్థానంలో జడ్పీ సీఈవో కె.ఎస్.ఎస్.సుబ్బారావును జివిడబ్ల్యు విఎస్ డబ్ల్యుఎస్ నోడల్ అధికారిగా నియమించారు.

సౌత్ జోన్ పోటీలకు విట్ విద్యార్థులు



విశాలాంధ్ర -భీమవరం: నవంబర్ 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు కేరళ యూనివర్సిటీ లో జరిగే సౌత్ జోన్ బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొనే జేఎన్టీయూ కాకినాడ జట్టుకు తమ విద్యార్థులు ఎ.వి.ఎస్.శశాంక్, ఎన్‌మోహన్ చంద్ ఎంపిక య్యారని విట్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దళిక సూర్యనారాయణ తెలిపారు. బుధవారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు ఆల్ రౌండ్ ప్రతిభ కనిపిస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్ర

జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర - భీమవరం: క్రీడల పట్ల గ్రామీణ యువతీ, యువకులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం డిశంబరు 11 వ తేదీ నుండి జనవరి 15వ తేదీ వరకు రాష్ట్ర మంతటా ఆడు దాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టరు అన్నారు. బుధవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమానికి సంబంధించి పశ్చిమ గోదావరి జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం నుండి వచ్చిన స్పోర్ట్స్ కిట్స్‌ను జిల్లా కలెక్టరుకు, ఉభయ గోదావరి జిల్లాల సెట్వెల్, స్పోర్ట్స్ సిఇవో చూపించారు. క్రీడా పరికరాలను పరిశీలించి క్రీడా కిట్లు వివరాలను జిల్లా కలెక్టరు అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువత క్రీడలలో ప్రోత్సహించడానికి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో విస్తృతంగా ఆటల పోటీలకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. డిశంబరు 11 వ తేదీన నుండి 408 గ్రామ సచివాలయాలు, 127 వార్డు సచివాలయం పరిధిలో అక్కడ ఉన్న క్రీడా స్థలంలో జరుగుటకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల సెట్వెల్ స్పోర్ట్స్ సిఇవో యండిహెచ్ మెహరాజ్,జిల్లా డియల్డివో కెసిహెచ్ అప్పారావు, డియల్డివోలు ఏవి అప్పారావు, యన్ వి యస్ ప్రసాద్ యాదవ్, జిల్లా చీఫ్ కోచ్ డాక్టర్ ఎం. దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

సుద్ద తవ్వకాలను ఆపేందుకు చర్యలు

విశాలాంధ్ర - లింగపాలెం : సుద్ద అక్రమ తవ్వకాలను ఆపేందుకు నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ చర్యలు తీసుకున్నారు. సుద్ద అక్రమ తవ్వ కాలు, అమ్మకాలపై విశాలాంధ్ర వెలుగులోకి తేవటంతో అధికారులు స్పందించారు. చింతలపూడి, లింగపాలెం మండలాల్లోని కొన్ని గ్రామాలలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ తవ్వకాలను ఆపాలని సబ్ కలెక్టర చింతలపూడి, లింగపాలెం తహశీల్దార్‌లను ఆదేశించారు. దీంతో వీరు చర్యలు చేపట్టారు. చింతలపూడి మండలంలోని ఫాతిమాపురం, ప్రగడవరం క్వారీల వద్ద రెవెన్యూ సిబ్బందిని కాపలా పెట్టారు. లింగపాలెం మండలంలోని కలరాయన గూడెం మార్గంలో వలసపల్లి చెక్‌పోస్టు వద్ద నిఘా పెట్టారు. చింతలపూడి, లింగపాలెం మండలాల తహశీల్దార్లు ఎ.కృష్ణజ్యోతి, ఆర్.వి.మురళీకృష్ణ రెవెన్యూ సిబ్బందికి సుద్ద అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పలు సూచనలు చేశారు. వీటి రవాణాను అడ్డుకునేందుకు పోలీసుల సహకారం తీసుకోవాలని సూచించారు. అక్రమ తవ్వకాలను, అమ్మకాలను నిరోధించటంలో ప్రజలు సహకరించా లని చింతలపూడి తహశీల్దార్ కృష్ణజ్యోతి తెలిపారు. సుద్ద తవ్వకాలు రవాణా జరుగుతుంటే ప్రజలు 9491041443, 9491041452 మొబైల్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

సొంత భవనంలోకి గురుకుల పాఠశాల విద్యార్థులు

- రూ. 9 కోట్లతో భవన నిర్మాణం

- ఎమ్మెల్యే విజ్ఞప్తికి స్పందించిన సీఎం

విశాలాంధ్ర - లింగపాలెం : దశాబ్ద కాలం క్రితం ప్రారంభించిన చింతలపూడిలోని బాలయోగి గురుకుల పాఠశాలకు సొంత భవనాన్ని శు క్రవారం ప్రారంభించ నున్నారు. దశాబ్దం పాటు ఈ పాఠశాలను చింతలపూడిలోని మార్కెట్ యార్డుల గోదాములలో నిర్వహిస్తున్నారు. వసతులు సక్రమంగా లేని ఈ గోదాములో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది ఎన్నో అవస్థలు పడుతూ ఉన్నారు. ఐదవ తరగతి నుంచి పదవ తరగతి వరకు ఉన్న ఈ పాఠశాలలో 600 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. వీరికి సరైన వసతులు లేకపోవటంతో ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ.. చలికి వణుకుతూ విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇటువంటి పరిస్థితులు లేకుండా విద్యార్థులకు పక్కా భవనం నిర్మించేందుకు 2018 మేలో అప్పటి ప్రభుత్వం ఆధ్వర్యంలో శంకుస్థాపన జరిగింది. దీని నిర్మాణం కోసం దాదాపు రూ. 9 కోట్లు మంజూరు చేశారు. పనులు పూర్తి చేయటంలో గుత్తేదారు నిర్లక్ష్యంగా వ్యవహరించి పనులను పూర్తి చేయలేదు. దీనివల్ల నిర్మాణం పూర్తి చేసేందుకు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎలీజా శ్రద్ధ చూపారు. నేరుగా సీఎం జగన్‌ను కలిసి ఈ పాఠశాల పరిస్థితిని ఎమ్మెల్యే వివరించటంతో సీఎం స్పందించారు. దీని నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవటం జరిగింది. దీంతో నిర్మాణం పూర్తయ్యింది. 24 తరగతి గదులు, వంటశాల, ఒకేసారి 400 మంది భోజనం చేసేందుకు వీలుగా డైనింగ్ హాలును నిర్మించారు. ఈ భవనాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఎమ్మెల్యే ఎలీజా కృషి ఫలితంగా బాలయోగి గురుకుల పాఠశాలకు సొంత భవనం నిర్మించటాన్ని విద్యార్థులు, వీరి తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ప్రారంభించనున్న ఈ భవనం విద్యార్థులకు సొంతమవుతుంది. దీని నిర్మాణం పూర్తి చేయటంపై ప్రజలు ఎమ్మెల్యే ఎలీజాను అభినందిస్తున్నారు.

3న కామవరపుకోటలో జగనన్నకు చెబుదాం

విశాలాంధ్ర-కామవరపుకోట: ప్రతి బుధవారం, శుక్రవారం మండల స్థాయిలో జేకేసి గ్రీవెన్స్ డే నిర్వహణలో భాగంగా కలిదిండి మండలంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ఈ నెల 3వ తేదీ శుక్రవారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ తెలిపారు. శ్రీచిన రాజప్ప ఆర్య వైశ్య కళ్యాణ మండపం, కొత్తూరు చెక్ పోస్టు రోడ్, కామవరపుకోట లో కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

డాక్యుమెంట్ పోయినది

విజయవాడ గాయత్రినగర్ కాపురస్తులు వై.గోపాల కృష్ణయ్య గారి కుమారుడు, వై.వి.బి.వి. ప్రసాద్ తెలియజేయునది ఏమనగా ది. 31-10-2023న నా తండ్రిగారి పేరున గల నాకు సంక్రమించిన ది. 21-12-2006 తేదీగల నూజివీడు రిజిష్టర్ ఆఫీసు దస్తావేజు నెంబరు 6047/2006గల విక్రయ దస్తావేజును నూజివీడు మధుసూధనరావు పెట్రోల్‌బంక్ ఎదురుగా ఫోటోస్టాట్ తీయించు నిమిత్తం మధ్యాహ్నం 2 గం॥ల సమయంలో తీసుకువెళ్ళగా సదరు విక్రయ దస్తావేజు ఒరిజినల్ దారిలో ఎక్కడో పడిపోయినది. ఎంత వెదికినా నాకు దొరకలేదు. ఎవరికైనా ఆ దస్తావేజు దొరికిన ఈ క్రింది ఫోన్ నెంబర్‌కి ఫోన్ చేసిన నేను వచ్చి ఆ దస్తావేజు తీసుకోగలవాడను.

వై. వెంకట బ్రహ్మేంద్ర వరప్రసాద్,
తండ్రి గోపాల కృష్ణయ్య, నూజివీడు.
సెల్ : 9393772477

ప్రజా ఉద్యమాలలో చురుకైన పాత్ర పోషించిన లక్ష్మయ్య

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: పేదల అభివృద్ధికోసం కమ్యూనిస్టు పార్టీలైన సీపీఐ,సీపీఎం ద్వారా ఎంతో మంది పేద ప్రజలకు ఇళ్ళ స్థలాలు అందించడం కోసం ఎన్నో ఉద్యమాలలో పాల్గొన్న మందపల్లి లక్ష్మయ్య మృతి స్థానిక ప్రజలకు తీరని లోటు అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన మందపల్లి లక్ష్మయ్య అనారోగ్యంతో మృతి చెందారు.ఈ సందర్భంగా బుధవారం డేగా ప్రభాకర్ స్థానిక నూకాలమ్మ గుడివద్ద ఉన్న లక్ష్మయ్య ఇంటికి వెళ్ళి అయన భార్య సుబ్బాయమ్మ ను, కుమారులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలియచేశారు.ఈ సందర్భంగా డేగా ప్రభాకర్ మాట్లాడుతూ మందపల్లి లక్ష్మయ్య మతోన్మాద పార్టీలకు వ్యతిరేకంగా ఉంటూ మొదట సీపీఐ లో చేరి క్రియాశీలక పాత్ర పోషించి ఎన్నో ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నారని, అనంతరం సీపీఎంలో చేరి పట్టణంలో సీపీఎం కార్యాలయం నిర్మించడంలోనూ, ఎంతోమంది పేదలకు ఇళ్ళ స్థలాలు పంచి పెట్టడంలోనూ విశేష కృషి చేసారన్నారు. అనంతరం టీడీపీ లో చేరి ఆయన చనిపోయేంత వరకూ ఆ పార్టీ లోనే పనిచేసినట్లు తెలిపారు. లక్ష్మయ్య బహు ముఖ ప్రజ్ఞాశాలి అని ఎన్నో నాటికలు,నాటకాల ద్వారా ప్రజలను చైతన్య పరచడమే కాకుండా కళా కారులను ప్రోత్సహించేవారని, మరో ప్రక్క ప్రజా ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారని తెలిపారు.సీపీఐ నుండి భద్రాచలం ఎంపీ గా పోటీ చేసిన సొడే రామయ్య గెలుపుకు లక్ష్మయ్య విశేష కృషి చేసారని తెలిపారు. పరామర్శించిన వారిలో సిపిఐ మండల కార్యదర్శి జెవి రమణ రాజు,మండల కౌన్సిల్ సభ్యుడు సుంకర రాధా కృష్ణ, టీడీపీ నాయకులు తూటిగుంట దుర్గారావు ఉన్నారు.

లక్ష్మయ్య మృతి ప్రజానాట్యమండలికి తీరని లోటు

విశాలాంధ్ర -కామవరపుకోట: సీనియర్ రంగస్థల కళాకారులు, పూర్వ ప్రజానాట్య మండలి కళాకారుడు, జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన మంద పల్లి లక్ష్మయ్య మృతి ప్రజానాట్యమండలికి తీరని లోటు అని ప్రజానాట్యమండలి సబ్ కమిటీ కన్వీనర్ టీవీఎస్ రాజు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గౌరవాధ్యక్షులు సబ్బి కనకారావు బుధవారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. మందపల్లి లక్ష్మయ్య జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన సీనియర్ రంగస్థలం నటుడు, దర్శకుడు కాసర నర్సిరెడ్డి, కీర్తిశేషులు దాసరి వెంకట్రావు లాంటి కళాకారులతో భయంకర నిలయం, పూలరంగడు తదితర సాంఘిక నాటకాలలో పలు పాత్రలు పోషించి వేలాదిమంది ప్రేక్షకుల అభిమానాన్ని పొందిన గొప్ప నటుడు అని కొనియాడారు. ప్రజానాట్యమండలి ద్వారా కళా రంగంలో ప్రవేశించిన లక్ష్మయ్య సుదీర్ఘకాలం కళాకారుడుగా కళామతల్లి ముద్దుబిడ్డగా కళాత్మక సేవలు అందించిన లక్ష్మయ్య మృతికి ఆంధ్రప్రదేశ్ జానపద కళాకారుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్ ఆర్ కృష్ణ బాబు, సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ వీరమల్ల మధుసూదన్ రావు కళాభిమాని సాయన రాఘవమ్మ, చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సాయన కనకరాజు, సీనియర్ బుర్రకథ కళాకారులు వీరమల్లు సత్యనారాయణ, బి నందకుమార్ ,టివి బ్రహ్మచారి, తోట లక్ష్మీనారాయణ, సీనియర్ కోలాట కళాకారిణి బొండలపాటి పద్మావతి, తదితరులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

జాతీయ దత్తత మాసోత్సవం

విశాలాంధ్ర-ఏలూరు: మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో బుధవారం జాతీయ దత్తత మాసోత్సవం ప్రారంభ కార్యక్ర మాలు శనివారపు పేట ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ప్రారంభమయ్యాయి. ఈ సంద ర్భంగా జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ సాధికారిత అధికారి కె.పద్మావతి మాట్లాడుతూ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారు ప్రతి ఏడాది నవంబర్ నెలను దత్తత మాసోత్స వంగా నిర్ణయించినట్టు తెలిపారు. ఏ ఒక్క చిన్నారులు అనాధలుగా వుండకుండా వారికి మంచి జీవితం అందించాలనే జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా నవంబర్ మాసమంతా దత్తత స్వీకరణ కార్యక్రమంపై ప్రచారం చేస్తూ అనేక అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ డాక్టర్ సి.హెచ్. సూర్య చక్రవేణి మాట్లాడుతూ చిల్డ్రన్ హోంలో చాలా సంవత్సరాలుగా ఉంటున్న పెద్దపిల్లలను తల్లిదండ్రులు, సంరక్షకులు లేని వారిని దత్తతప్రక్రియలోనికి తీసుకువచ్చి వారిని దత్తత ఇచ్చి వారికి మంచి కుటుంబాన్ని అందించుట జాతీయ దత్తత మాసోత్సవం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు రాజేశ్వరావు మాట్లాడుతూ చిల్డ్రన్ హెూంలోని అనాధల పిల్లలను వారి వ్యక్తిగత రిపోర్టులను పరిశీలించి వారికి లీగల్లీ ఫ్రీ ఫర్ అడాప్షన్ ఆర్డర్ ఇచ్చి వారిని దత్తత ఇచ్చి మంచి కుటుంబ వాతావరణంలో పెరిగేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమములో ప్రభుత్వ బాలుర హెూం సూపరింటెండెంట్ మురళీధరన్, డి.పి.ఓ దుర్గాప్రసాద్, సైకాలజీ కౌన్సిలర్స్ వీర్రాజు, బిందు ప్రొటెక్షన్ ఆఫీసర్ ఆర్. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై గుంతలు పూడ్చండి మహాప్రభో...

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : రహదారిపై గుంతలు ఏర్పడడంతో, రహదారిపై ప్రయాణించే వాహనాలు పలు ప్రమాదాలకు గురవుతున్నాయి. కొయ్యలగూడెం పట్టణం నుండి కన్నాపురం గ్రామం వెళ్లే రహదారి పై గుంతలు ఏర్పడడంతో, ఈ రహదారిపై ప్రయాణించాలంటే ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని ప్రయాణాలు చేయవలసి వస్తుందని, వాహన చోదకులు ప్రయాణికులు వాపోతున్నారు. కొయ్యలగూడెం గ్రామ శివారు అంకాలగూడెం గ్రామ ప్రారంభంలో వినాయకుని ఆలయం వద్ద రహదారిపై పెద్ద,పెద్ద, గోతులు ఏర్పడడంతో జామాయిల్ కర్ర లోడుతో వెళుతున్న ట్రాక్టర్ ఒక్కసారిగా గోతులు ఉన్నచోట రహదారికి అడ్డంగా పడిపోవడంతో రహదారిపై రాకపోకలు కొనసాగించే వాహనాలకు అంతరాయం ఏర్పడింది. కొయ్యలగూడెం పట్టణ నుండి కన్నాపురం గ్రామం వరకు వెళ్ళే రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చి, నూతన రహదారిని సంబంధిత అధికారులు నిర్మించాలని వాహన చోదకులు, ప్రయాణికులు, పాదచారులు కోరుతున్నారు.

పొట్టి శ్రీరాములుకు వంక రవీంద్రనాథ్ నివాళులు

విశాలాంధ్ర-తణుకు: తెలుగు వారం దరూ రాష్ట్ర అవతరణ దినోత్స వాన్ని ఘనంగా జరుపుకోవాలని శాసన మండలి సభ్యులు, లయన్స్ రాష్ట్ర అధ్య క్షులు వంక రవీంద్రనాథ్ అన్నారు. బుధవారం లయన్స్ క్లబ్ అఫ్ పైడిపర్రు-తేతలి ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు వంటెద్దు రాజా కార్యాలయం వద్ద , తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి శ్రీరాములు కు నివాళులు ప్రకటించారు. అమర జీవి పొట్టి శ్రీరాములు మన కోసం ఆమరణ నిరాహారదీక్ష చేపట్టిన విధానం పుస్తకాలలో చదువుతుంటే ఎంతటి వారి కైనా కన్నీటి పర్యంతం అవుతారని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అందరం కలసి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వంక రాజకుమారి, ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మాదిరెడ్డి బాపూజీ, జవ్వాది తమ్మయ్య, నాయుడు, డాక్టర్ కుదారి ఆనంద్, కుదారి రోజని, మాదిరెడ్డి కృష్ణ కుమారి , పుచ్చల బాలాజీ, మారిశెట్టి శేషగిరి తదితరులు పాల్గొన్నారు

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: నిరాడంబరుడు, త్యాగమూర్తి, అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం స్ఫూర్తి దాయకమని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ పేర్కొన్నారు. ఏలూరు కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ,జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి పాల్గొన్నారు.జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం గౌతమీ సమావేశ మందిరంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అమరజీవికి నివాళులు అర్పించిన వారిలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ, జిల్లా రెవిన్యూ అధికారి యం. వెంకటేశ్వర్లు, ఏలూరు ఆర్డిఓ ఎన్.ఎస్.కె. ఖాజావలి, జిల్లా బి.సి. సంక్షేమాధికారి ఆర్. నాగరాణి, బి.సి. కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్.పుష్పలత, ఎస్సీకార్పోరేషన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కుముదిని సింగ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.వి.వి.సత్యనారాయణ, కలెక్టరేట్ ఏవో ఎస్.రమాదేవి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్న దొర, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ బాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం కృషి చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమన్నారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల సాధనకోసం అహర్నిశలు కృషిచేసి ఆంధ్రరాష్ట్ర ఆవిర్భావానికి శ్రీకారం చుట్టిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలు అజరామరమన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు, విద్యార్థినీ, విద్యార్థులు, కలెక్టరేట్ సిబ్బంది, పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర-ఏలూరు క్రైమ్: అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమని జిల్లా ఎస్పి డి. మేరీ ప్రశాంతి అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అవత రణ దినోత్సవం పురస్క రించుకొని జిల్లా ఎస్పి డి. మేరీ ప్రశాంతి జండా వందనం చేశారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ దేశంలో తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గుర్తింపు పొందిందన్నారు. భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు చేయాలన్న అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితమే నేడు ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా అదనపు ఎస్పి ఎంజెవి భాస్కర రావు, ఏ.ఆర్ అదనపు ఎస్పి ఎస్.ఎస్.శేఖర్, పోలీస్ ప్రధాన కార్యాలయం పరిపాలన అధికారి బి.వి.ఎస్.ఆర్ కె నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు లింగాల విద్యార్థిని ఎంపిక

విశాలాంధ్ర-మండవల్లి: అండర్-17 బాలికల కబడ్డి రాష్ట్రస్థాయి పోటీలకు మండలంలోని లింగాల జెడ్పీ హైస్కూలు విద్యార్థిని సిహెచ్.గాయత్రి ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు బి.వేణుబాబు ఒక ప్రకటనలో తెలిపారు.గుడివాడ ఎస్‌పిఎస్ స్కూలులో జరిగిన కబడ్డి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన గాయత్రి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావటం పట్ల లింగాల సర్పంచ్ బి.రాధిక, స్కూలు ఎస్ఎంసి చైర్మన్ లక్ష్మణరావు, పాఠశాల అధ్యాపకులు అభినందించారు.

నేడు మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-మండవల్లి: మండలప్రజా పరిషత్తు సర్వసభ్య సమావేశం ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామదుర్గా ప్రసాద్ అధ్యక్షతన మండలపరిషత్తు సమావేశపు హాలులో గురువారం మధ్యాహ్నం 2గంటలకు జరుగుతుందని ఎంపిడివో టికె.వెంకటరమణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వివాహ వేడుకలో జనసేన ధర్మరాజు

విశాలాంధ్ర - నిడమర్రు: నిడమర్రు మండలం అడవి కొలను గ్రామ వాస్తవ్యులు పైడి కొండల వెంకట సుబ్బారావు కుమారుడు పైడికొండల ఏసుబాబు వివాహ వేడుకలు సందర్భంగా ఉంగుటూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు బుధవారం వారిని కలిసి ఆశీర్వదించారు. ఆయనతో పాటు నిమ్మల దొరబాబు,కోటిపల్లి రాధాకృష్ణ, వంగ రఘు, వాసు రాజు ,కొత్యాల సురేష్, గిరి, అడ్డగర్ల ఏసు, గ్రామ జనసైనికులు,తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ పాస్టర్స్ ఐక్య వేదిక బలోపేతానికి కృషి

విశాలాంధ్ర-టి నరసాపురం: ఆదివాసీ ఐక్య వేదిక బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆ సంస్థ నూతన జాతీయ అధ్యక్షులు కురసం నిరీక్షణరావు తెలిపారు. టి నరసాపురం మండలం మర్రి గూడెం గ్రామంలో ఆంధ్ర తెలంగాణా పాస్టర్స్ ఐక్య వేదిక సమావేశం నిరీక్షణ రావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐక్యవేదిక జాతీయ అధ్యక్షులుగా కురసం నిరీక్షణరావు, ప్రధాన కార్య దర్శి మడివి ఫిలిప్, ఉపాధ్యక్షులు గుండి ఫిలిప్, సహాయ కార్యదర్శి బందారు జాన్ బాబు కోశాదికారి చింత సమూయేల్ రాజు లను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిరీక్షణ రావు మాట్లాడుతూ దేశంలో ఆదివాసీ పాస్టర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఐక్యవేదిక కృషి చేస్తుందని తెలిపారు. ప్రభుత్వంతోను అధికారులతోను చర్చించి సమన్వయంతో ముందుకు సాగుతామని అన్నారు. ఆదివాసీ పాస్టర్స్ ఐక్యవేదిక ఎల్లప్పుడూ పాస్టర్స్ అభ్యున్నతికి పాటు పడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బెజ్జం రవిబాబు, ఉబ్బా యోహాను, కంగాళ్ళ పౌలు,ఎం జాన్ మార్క్ గద్దం రాజారత్నం, పాయం స్టివిన్ దొర తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లస్థలాల పట్టాలు

విశాలాంధ్ర - నిడమర్రు: అర్హులైన ప్రతి పేదవాడికి ఇళ్ల స్థలాల పట్టాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు(వాసు బాబు) అన్నారు. బుధవారం నిడమర్రు మండలం పెదనింద్రకొలను గ్రామానికి చెందిన 216 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎవరికైనా రేషన్ కార్డు కావాలన్నా, పెన్షన్ కావాలన్నా, హౌసింగ్ లోన్ కావాలన్నా, కార్పొరేషన్ లోన్ కావాలన్నా గ్రామంలో రాజ్యాంగేతర శక్తులుగా ఏర్పడిన జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్ళరిగేలాతిరగాల్సి వచ్చేదన్నారు. నేడు ఆ పరిస్థితికి పూర్తి భిన్నంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వై.ఎస్ జగన్మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముగ్గళ్ళ యాకోబు, జెడ్పీటీసీ కోడే కాశీ, ఎంపీపీ దనుకొండ ఆదిలక్ష్మి, తహసిల్దార్ బి. సాయిరాజ్, ఎంపీడీవో విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లను ఉపేక్షించేది లేదు

విశాలాంధ్ర-భీమవరం: జిల్లాలో ఆమోదం పొందిన లేఔట్లను ప్రజల పరిశీలన నిమిత్తం జిల్లా వెబ్ సైట్‌లో ఉంచడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ అధికారులు, డిపిఓ, జిల్లాలోని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశమై లేఅవట్లపై సమీక్షించారు. అక్రమ లేఔట్లను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. ఆగస్టు 31, 2019 నాటికి ఉన్న లేఔట్లలో అనుమతి పొందినవి, అనుమతి లేనివి, ఎల్.అర్ స్కిన్ కింద క్రమబద్ధీకరించుటకు అనువుగా ఉన్న వాటి సమాచారాన్ని పక్కాగా సమర్పించాలన్నారు. అనుమతి పొందిన లేఔట్లను గ్రామాల వారీగా ప్రజలు పరిశీలించుకునేందుకు అనువుగా జిల్లా వెబ్‌సైట్లో ఉంచాలన్నారు. అర్బన్ టౌన్ ప్లాన్ లాగా గ్రామాల్లో ప్లాన్ లేదని, సమిత్వ గ్రామ కంఠము సంబంధించి సర్వేలో విలేజ్ ప్లాన్‌లో డ్రెయిన్లు, రోడ్లు అప్రూవ్ చేయాల్సి ఉందన్నారు. .ఈ సమావేశంలో ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ విసి చంద్రశేఖర్, ప్లానింగ్ ఆఫీసర్ సురేఖ, డిపిఓ జీవీకే మల్లికార్జునరావు, భీమవరం టౌన్ ప్లానింగ్ అధికారి గౌర్, తణుకు, పాలకొల్లు, నరసాపురం, ఆకివీడు, తాడేపల్లిగూడెం టౌన్ ప్లానింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించకపోయినా...
రామకోటయ్య స్పందించారు

విశాలాంధ్ర-చాట్రాయి: స్పందనలో పెట్టుకున్న అర్జీకి ప్రభుత్వం స్పందించకపోయినా రామకోటయ్య స్పందించి వేలాది రూపాయల విలువైన మందులను తన ఇంటికి పంపించారని వ్యవసాయ కార్మిక సంఘం చాట్రాయి మండల నాయకులు కొమ్ము ఆనందం కొనియాడారు. బుధవారం చాట్రాయి మండలం చిన్నంపేట గ్రామంలోని కొమ్ము ఆనందం నివాసానికి నూజివీడు మాజీ శాసనసభ్యులు చిన్నం రామకోటయ్య విలువైన వేలాది రూపాయల మందులను పంపించారు. ఈ సందర్భంగా కొమ్ము ఆనందం భార్యనిర్మలతో కలిసి మాట్లాడుతూ ప్యాంక్రియాస్ గ్రంధిని శస్త్ర చికిత్స ద్వారా తనకు తీసివేశారని తెలిపారు. ప్రతినెలా మందులు ఎనిమిది వేల రూపాయలకు పైగా ఖర్చు అవుతుందని తీవ్రమైన అనారోగ్యంతో ఉన్న తాను ఏమీ పని చేయలేని పరిస్థితిలో స్పందనలో ప్రభుత్వానికి అర్జీ పెట్టుకున్నానని తెలిపారు. నరసింహారావు పాలెం మాజీ ఎంపీటీసీ అత్తునూరి సుబ్బారెడ్డి, ద్రోణంరాజు శ్రీనివాసరావు. సుందర్ రావు, కొమ్ము సుజన్ రావు తదితరులు పాల్గొన్నారు.

జువ్వలపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర-కాళ్ళ : పేదలకు ప్రభుత్వ పథకాలు అందాలంటే మళ్లీ జగన్ ముఖ్యమంత్రి అవ్వాలని ఉండి నియోజకవర్గం వైసిపి పార్టీ కన్వీనర్ పివిఎల్. నరసింహ రాజు అన్నారు. మండలంలోని జువ్వలపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రతి ఇంటిని దర్శించి, వారికి వస్తున్న పథకాలను అడిగి తెలుసుకున్నారు. రానివారికి త్వరలోనే పథకాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు డ్రైనేజ్ డ్రైనేజ్ సమస్యను ఆయన దృష్టికి తీసుకురాగా సమస్యను పరిష్కరిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రుద్రరాజు కృష్ణంరాజు, పి.సోమేశ్వరరావు, కే లక్ష్మీపతి రాజు, పి విశ్వనాథరాజు,ముదిండి సురేష్, రాజు మీసాల శ్రీనివాస్, గుర్రం జార్జ్ బెన హర్,బాదనపు కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

విశాలాంధ్ర - లింగపాలెం : తెదేపా అధినేత చంద్రబాబునాయుడు ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ ధర్మాజీగూడెంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు పాతూరి శ్రీనివాస్(స్వామి) ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేశారు. ఆలయంలో పూజలు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న రోగులకు పండ్లు, రొట్టెలు పంచారు. బెయిల్‌పై వచ్చిన చంద్రబాబు ఆరోగ్యం బాగుండాలని కోరుతూ ఆయనపై పెట్టిన అక్రమ కేసులు కొట్టివేయాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చెరువుగట్టు రామ్మోహన్, గజ్జె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

9న ఆర్.ఆర్.డి.ఎస్.ప్రభుత్వ కళాశాల
స్వర్ణోత్సవ వేడుకలు

విశాలాంధ్ర -భీమవరం: భీమవరం విద్యా రంగం చరిత్రలో ఆర్.ఆర్.డి.ఎస్.ప్రభుత్వ కళాశాలకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉందని వేలాది మంది విద్యార్థులను జాతికి అందించిందని పలువురు వక్తలు పేర్కొన్నారు. నవంబర్ 9న జరిగే ఆర్.ఆర్.డి.ఎస్.ప్రభుత్వ కళాశాల స్వర్ణోత్సవ ఆహ్వాన పత్రికలను బుధవారం కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వసుధ ఫౌండేషన్ నిర్వాహకులు ఇందుకూరి ప్రసాదరాజు, మానవత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు వి.బి.వెంకటపతిరాజు, శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలతో పాటు రాజారామ్ మోహన్‌రాయ్ ద్విశత జయంతి వేడుకలు జరుపుతున్నామన్నారు. విధాన పరిషత్ చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాసరావు, పలువురు మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లు, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, భీమవరం ఆర్డీఓ కె.శ్రీనివాసరాజు, ఉయ్యూరు ఆర్డీఓ దాసి రాజు, రాజమండ్రి డాక్టర్ ఆర్జేడీ చప్పిడి కృష్ణ, మున్సిపల్ కమీషనర్ ఎం.శ్యామల అతిథులుగా విచ్చేసి తమ సందేశాలిస్తారని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కె.జె.ప్రసూన, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.లక్ష్మీకాంతం, డాక్టర్ కాకుమాని శ్రీనివాసరావు, డాక్టర్ అరవింద్ స్వామి, డాక్టర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నోట్: యాడ్ ప్రయార్టీ పిడిఎఫ్ లో ప్రచురించగలరు

రాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు పంపిణీ

విశాలాంధ్ర -భీమవరం: రాజ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గంటా రాజకుమార్ జన్మదినం పురస్కరించుకుని పలువురు పేద మహిళలకు కుట్టు మిషన్లు, వెయ్యి రూపాయల నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంట సుందర్ కుమార్ మాట్లాడుతూ రాజ్ ట్రస్ట్ ద్వారా ఇప్పటి వరకు లక్షలాది రూపాయలతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని, వీటి ద్వారా వేలాదిమంది ఆర్థిక స్వావలంబన సాధించడం గొప్ప విషయమన్నారు. రాజ్ ట్రస్ట్ అందిస్తున్న స్ఫూర్తితో మరింత మంది సాధికారత సాధించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పట్టెం శుభాకర్, సాదే మహేష్, జి.డి.కరుణాకర్, దాసరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వన్నెపూడి కళాకారుడికి జాతీయస్థాయి
నాటక పోటీల్లో తృతీయ బహుమతి

విశాలాంధ్ర - గొల్లప్రోలు : తెనాలిలోని తెనాలి రామకృష్ణ కళా ప్రాంగణంలో వేద గంగోత్రి ఫౌండేషన్ కళల కాణాచి వారి ఆధ్వర్యంలో వీణా అవార్డులకు జాతీయస్థాయిలో 38 పౌరాణిక పద్య నాటక పోటీలను నిర్వహించగా, కాకినాడకు చెందిన శ్రీ కుమారారామ భీమేశ్వర నాట్యమండలి ప్రదర్శించిన నర్తనశాల పద్య నాటకానికి జాతీయస్థాయిలో తృతీయ బహుమతి లభించింది. శంఖవరానికి చెందిన కీర్తిశేషులు కాళ్ళూరి రామారావు దర్శకత్వం వహించగా షేక్ అమీర్ ఈ నాటకంలో అర్జునుడు, బృహన్నల పాత్ర పోషించిన వన్నెపూడికి చెందిన కళాకారుడు పొలమూరు సీతా రామకృష్ణ, అమీర్, కోదండరావు సంయుక్తంగా సంస్థ తరఫున ప్రముఖ సినీ రచయిత బుర్ర సాయి మాధవ్ చేతుల మీదుగా తృతీయ బహుమతి స్వీకరించారు. జాతీయ స్థాయిలో ప్రదర్శింపబడిన నర్తనశాల నాటకంలో అర్జునుడు, బృహన్న పాత్రలలో నటించి ఉత్తమ ప్రతిభ కనబరిచినందున వన్నెపూడి గ్రామ ప్రజలు, సంస్థ తరఫున తృతీయ బహుమతి స్వీకరించిన పొల్లమూరి రామకృష్ణను పలువురు అభినందించారు.

పలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధాన్ని వ్యతిరేకిద్దాం

విశాలాంధ్ర-తణుకు: పలస్తీనా - ఇజ్రాయిల్ మధ్య జరుగుతున్న యుద్ధం మహిళలు, చిన్నారుల వంటి సాధారణ ప్రజల మరణాలకు దారితీయడం ఆందోళన కలిగించే విషయమని సామాజిక న్యాయపోరాట సమితి సంయుక్తంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం అభిప్రాయపడింది. స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి సామాజిక న్యాయపోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పేరూరి మురళీకుమార్ అధ్యక్షత వహించారు. ఈ యుద్ధాన్ని ఇప్పటికే ప్రచారంలో ఉన్న అంశాలపై కాకుండా మరింత సునిశితంగా పరిశీలించాలని ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ సామాజికవేత్త డివివిఎస్ వర్మ అన్నారు. గాజాపై ఇజ్రాయిల్ ప్రతిరోజూ బాంబు దాడులతో విరుచుకు పడుతూ వేలాది మంది మహిళల్ని , చిన్నారులను బలి తీసుకుంటున్న విషయం చూస్తూనే ఉన్నామని, మరోవైపు సామ్రాజ్యవాద శక్తులన్నీ ఏకమై ఇజ్రాయిల్ పక్షం వహించి పాలస్తీనా అరబ్ జాతిని అంతమొందించే దిశగా యుద్ధాన్ని ఎగదోయడాన్ని ప్రజాస్వామికవాదులంతా ఖండించి పాలస్తీనా స్వతంత్ర పోరాటాన్ని సమర్థించాలని వర్మ కోరారు. ఈ సందర్భంగా జరిగిన చర్చాకార్యక్రమంలో రెండు దేశాల మధ్య నెలకొన్న చారిత్రక అంశాలపైన, అంతర్జాతీయ రాజకీయ ప్రభావాలపైన పాల్గొన్న ప్రతినిధులు లోతైన చర్చ జరిపారు. సిపిఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, సిఐటీయు జిల్లా కార్యదర్శి దక్షిణామూర్తి, సిపిఎం జిల్లా కార్యదర్శి పి. వి. ప్రతాప్, పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి కౌరు వెంకటేశ్వర్లు , ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కామన మునుస్వామి , రిటైర్డ్ సబ్ రిజిస్ట్రార్ నీలం మాల్యాద్రి, సామాజిక న్యాయపోరాట సమితి రాష్ట్ర గౌరవాధ్యక్షులు గొల్లపల్లి అంబేద్కర్ , దళితనేత గొల్లపల్లి వివేకానంద , న్యాయవాది పొట్ల సురేష్ , విద్యార్థి నాయకులు శ్యామ్, మణిబాబు, కార్యకర్తలు గుండే శేఖర్ , మెడికల్ రిప్రజంటేటివ్ శివ ఇంకా పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం

విశాలాంధ్ర-భీమవరం టౌన్ : పశ్చిమ గోదావరి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకొని బుధవారం జిల్లా ఎస్పి యు.వి రవి ప్రకాష్ అమర జీవి శ్రీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ నవంబరు 1వ తేదీగా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఏర్పడినట్లు, ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుంచి విడిపోయి 1953, అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రం అవతరించగా, 1956 నవంబర్ 1న హైదరాబాద్ రాష్ట్రం విలీనం కావడంతో ఆంధ్ర రాష్ట్రం కాస్తా ఆంధ్ర ప్రదేశ్ గా మారిందన్నారు.దేశంలో తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గుర్తింపు పొందిందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్ పి అడ్మిన్ ఏవి సుబ్బరాజు, ఏ ఆర్ డీఎస్ పి సత్యనారాయణ, ఆర్ ఐ లు, ఎస్ ఐ లు, ఎస్ బి, డి సి ఆర్ బి, డి పి ఓ స్టాఫ్ ఇతర సిబ్బంది పాల్గొని శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు.

కొయ్యలగూడెంలో : ఆంధ్ర రాష్ట్రం కోసం అమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణ త్యాగమర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బొమ్మ బాబు, మాటూరు చంటి, గౌరీ శంకర్రావు,సురేష్,పాల్గొన్నారు.

నరసాపురంలో: ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు అని నరసాపురం ఆర్డీవో ఎం.అచ్యుత అంబరీష్ అన్నారు. బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఆర్డీవో అచ్యుత అంబరీష్, సిబ్బంది, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటుకు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అన్నారు. ఆయన మహాత్మా గాంధీ బోధించిన సత్యము అహింస హరి జనోద్ధరణ అనే ఆశయాల కొరకు కృషి చేసిన మహనీయుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవో నాగార్జున, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లింగపాలెంలో: రాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలు అర్పించిన పొట్టి శ్రీరాములు త్యాగాన్ని స్మరిస్తూ ఈయనకు నివాళులర్పించారు. లింగపాలెం తహశీల్దార్, మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి తహశీల్దార్ ఆర్.వి.మురళీకృష్ణ, ఎంపిడిఓ ఆశీర్వాదం పూలమాలలు వేసి నివాళులర్పించి ఈయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముదినేపల్లిలో : తెలుగు రాష్ట్ర ఏర్పాటుకు ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, ఎంపీడీవో పి మల్లేశ్వరి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాంగణంలో వెలుగు, ఎంపీడీవో కార్యాలయం ఆధ్వర్యంలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ 1956 నవంబర్ 1న తెలుగు రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితమే తెలుగు భాషా ప్రయుక్త రాష్ట్రానికి అంకురార్పణ జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి దూలం లక్ష్మీనారాయణ , జూనియర్ అసిస్టెంట్ సుబ్బారావు, కార్యదర్శులు జి. రమేష్, శ్యాంసుందర్, వెలుగు సిసిలు కల్పన, నాగలక్ష్మి, పెయ్యేరు ఉప సర్పంచ్ దివి సతీష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన సరుకులు పక్కదారి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: ప్రభుత్వం ఎన్నో కోట్ల రూపాయలు వెచ్చించి విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనం పథకాన్ని కొందరు కాసులకు కక్కుర్తి పడి దుర్వినియోగం చేస్తున్నారు.జంగారెడ్డిగూడెం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు ప్రతీ రోజు పిల్లలకు పెట్టాల్సిన గుడ్లు, వేరుశనగ చిక్కిలు,బియ్యం,రాగిపిండి మొదలైన సరుకులను పక్కదారి పట్టిస్తున్నారని తెలుసుకున్న పాఠశాల పేరెంట్స్ కమిటీ మంగళవారం సాయంత్రం పాఠశాల వెనుక ఉన్న గోడ సందులో దాచి ఉంచడం గమనించి మీడియాకు సమాచారం ఇచ్చారు. డి వై ఈ ఓ రామన్న దొర బుధవారం పాఠశాలలో విచారణ చేపట్టారు.విచారణలో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.మంగళవారం వెయ్యి మంది పిల్లలు పాఠశాలకు హాజరైతే 750 మందికి పైగా విద్యార్థులు మధ్యాహ్న భోజనం తిన్నట్లు ఆన్ లైన్ లో నమోదు చేసినట్లు గుర్తించారు.కానీ భోజనం తిన్నది మాత్రం సుమారు 270 మంది మాత్రమే అని అధికారులు ఖంగు తిన్నారు.అంటే ప్రతీ రోజు సుమారు 500 మందికి పైగా విద్యార్థులు భోజనం చెయ్యకపోయినా చేసినట్లు నమోదు చేసి ఆ సరుకులను పక్క దారి పట్టిస్తున్నట్లు విచారణలో గుర్తించారు.మధ్యాహ్న భోజనం రుచికరంగా లేకపోవడంతో విద్యార్థులు ఇంటి దగ్గరి నుండి క్యారియర్ లు తెచ్చుకుంటున్నారని అధికారులు గుర్తించారు.ప్రధానోపాధ్యాయురాలు మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులు కలిసి ఈ అక్రమాలకు పాల్పడుతున్నారని పేరెంట్స్ కమిటీ సభ్యులు విచారణ అధికారులకు ఫిర్యాదు చేశారని తెలిపారు.ఈ విషయాలన్నీ జిల్లా విద్యాశాఖాధికారి ద్వారా జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని అధికారులు తెలిపారు. ఈ విచారణలో మండల విద్యాశాఖ అధికారులు బి.రాముడు,రాములు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఆర్యవైశ్య నాయకుల నివాళులు

విశాలాంధ్ర - అమలాపురం : ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములుకి వైశ్య యువ నాయకులు కాళ్లకూరి గోపికృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంగా అవతరించడానికి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం వెలకట్టలేనిదన్నారు. 52 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి రాష్ట్రం సాధించేవరకు ఒంటరిగా అలుపెరుగని పోరాటం చేసిన వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. ఇప్పటికైనా ఆ త్యాగనిరతిని గుర్తించి పొట్టి శ్రీరాములుకి భారతరత్న ఇవ్వాలని కాళ్ళకూరి గోపికృష్ణ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అమలాపురం ఆర్యవైశ్య పెద్దలు బచ్చు ప్రభాకర్, సుగ్గు ప్రసాద్, పచ్చిగోళ్ళ నాగరాజు, పచ్చిగోళ్ళ నర్సిబాబు, గ్రంధి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేటలో : ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పించిన అమరజీవి, మహాపురుషుడు పొట్టి శ్రీరాములు అని వైసిపి సీనియర్ నేత, కాకినాడ జిల్లా జెసిఎస్ కో ఆర్డినేటర్ ఒమ్మి రఘురామ్ అన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయంలోను, జగ్గంపేట పంచాయతీ కార్యాలయంలోను పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రఘురామ్ మాట్లాడుతూ ఆంధ్రులకు ప్రాత, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు శ్రీరాములు కారణ భూతుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వసంత్ కుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కరపలో : కరప మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా జరుపుకున్నారు. మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ పొన్నమండ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతిని కార్యాలయ సిబ్బందితో ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె. అప్పారావు ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బందితో కలిసి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ అనిల్, ఆర్ఐ మాసరావు, సర్వేయర్ రామకృష్ణ వీఆర్వోలు తదితరులు పాల్గొనగా, మండల పరిషత్ సూపరింటెండెంట్ గుత్తుల భీమ శంకర్, సురేష్, రాయుడు, నగేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురంలో: మండల కేంద్రంలోని ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి ఎంపిడిఓ నాతి బుజ్జి, జెడ్పీటీసీ సభ్యులు, బోణం సాయిబాబా, ఆప్కాస్ డైరెక్టర్, కప్పల శ్రీధర్, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్, కనుమూరి శ్రీనివాసరాజు, యంపిటిసి సభ్యులు చిలువూరి నాగ రామ సత్యనారాయణ రాజు, సల్లపూడి కుమారి, తూము రామ కృష్ణ చక్రధర కాశీ విశ్వనాథం, పేరవరం గ్రామ సర్పంచ్ గంటి విజయ భారతి నాగేశ్వరరావు మండల పరిషత్ పరిపాలనాధికారి టివి సురేంద్ర రెడ్డి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ నాతి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు అమరజీవి అని మహా పురుషుడు, భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడు అని మహాత్మా గాంధీ బోధించిన సత్యము, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయులు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది, సూర్యనారాయణ రాజు, త్రిమూర్తులు, మరియు దావీదు పాల్గొన్నారు.

డిగ్రీ నాల్గో సెమిస్టర్ ఫలితాల్లో దీప్తి ప్రభంజనం

ఎలక్ట్రానిక్స్‌లో 100% ఉత్తీర్ణతతో ఉమ్మడి తూర్పుగోదావరిలో ఫస్ట్

విశాలాంధ్ర - మామిడికుదురు : ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి నూతనంగా ప్రవేశ పెట్టిన ఆంగ్లమధ్యమం విద్యా విధానంలో తొలి బ్యాచ్‌కు చెందిన నాల్గో సెమిస్టరు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని మామిడికుదురు దీప్తి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డివివి సత్యనారాయణ చెప్పారు. రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ విద్యాలయం మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో తమ విద్యార్థులు కోనసీమలోనే అగ్ర స్థానంలో నిలిచారన్నారు. బీఎస్సీ ఎలక్ట్రానిక్స్ విద్యార్థులు ఉమ్మడి తూర్పు గోదావరిలోనే అత్యుత్తమంగా నూరు శాతం ఉత్తీర్ణత సాధించి ప్రథమ స్థానంలో నిలిచారని చెప్పారు. నేటి సాంకేతిక రంగలో ఎలక్ట్రానిక్స్‌లో ప్రాధాన్యత సంతరించుకున్న మైక్రో ప్రాసెసర్, మైక్రో కంట్రోలర్ విభాగంలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణతతో పాటుగా 10/10 గ్రేడ్ సాధించారని వివరించారు. బీఎస్సీ (బీజెడ్సీ) విభాగానికి చెందిన గుబ్బల మౌనిక 9.9 గ్రేడ్ పాయింట్లతో ప్రథమ స్థానంలో నిలిచింది అన్నారు. బీఎస్సీ (ఎంపీసీఎస్) విభాగానికి చెందిన విద్యార్థినిలు నార్ని వందన లీలా దుర్గ, గూటం దివ్య 9.8 గ్రేడ్ పాయింట్లతో ద్వితీయ స్థానంలో నిలిచారని చెప్పారు. అలాగే బీఎస్సీ ఎంపీసీఎస్ విద్యార్థులు కడలి రాజశ్రీ, మొల్లేటి తేజస్వి, నిషాత్ ఫాతిమా, చెల్లుబోయిన హారిక 9.7 గ్రేడ్ పాయింట్లతో తృతీయ స్థానంలో ఉన్నారన్నారు. అలాగే ఎలక్ట్రానిక్స్ విభాగం నుంచి తిరుమాని నాని 9.6 గ్రేడ్‌తో, బీకామ్ నుంచి బొలిశెట్టి సుజాత 9.5 గ్రేడ్ తో, బీబీఏ నుంచి సీహెచ్. దివ్య శ్రీ 9.5 గ్రేడ్‌తో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. వీరుతో పాటుగా మరో 37 మంది 9గ్రేడ్ పాయింట్లు దాటి మార్కులు పొందారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఉత్తమ గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన అధ్యాపకులకు కూడా ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా సబ్జెక్టుల విభాగాధిపతులు మోకా రంగారావు, వాసంశెట్టి నాగరాజు, కోడూరి వెంకటేష్, యాలంగి రవికుమార్, డాక్టర్ వైవిఎస్ ప్రసాద్, బి. సృజన, ఎన్. పూర్ణశ్రీ, రాధ, వనిమిశెట్టి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు

విశాలాంధ్ర - రావులపాలెం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రావులపాలెం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ తాడేపల్లి నాగమణి మరియు ఉప సర్పంచ్ గొలుగూరి ముని రెడ్డి ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రావులపాలెం ఎంపిటీసి సభ్యులు కోట విజయ్ కుమారి సత్తిబాబు, పంచాయతీ కార్యదర్శి ఎల్.దుర్గాప్రసాద్, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరులో : ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలను అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ముద్దుల సోమరాజు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ ఆవిర్భావ దినం సందర్భంగా పట్నంలోని కోట్ల వారి జంక్షన్ వద్ద ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పలువురు ఆర్యవైశ్య నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు మద్దుల సత్యనారాయణ వలివేటి ప్రసాద్ కోట్ల రాఘవ కాకి అనిల్, సత్యవరపు గుర్నాథ్ తుమ్మలపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గోకవరంలో:గోకవరంలోని శ్రీ వాసవి ఆర్య సేవా సంఘం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య కళ్యాణమండపం వద్ద ఉన్న అమరజీ పొట్టి శ్రీరాములు మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ కు 58 రోజులు ఆమరణ చేసి తెలుగు రాష్ట్ర అవతరణకు కృషి చేసిన అమరజీవి ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని ఈ సందర్భంగా ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నానాజీ, సంఘ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో : ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం నిర్వహించారు. బుధవారం దేవరపల్లి తహసీల్దార్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి తహసీల్దార్ రామకృష్ణ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎమ్మెస్ శ్రీనివాస్, కృష్ణ కిషోర్, కాళ్ల వెంకన్న బాబు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెరవలిలో : నవంబర్ 1వతేదీ ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పెరవలి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మండల అధ్యక్షులు కార్చెర్ల సీత రామ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన ఎనలేని త్యాగాలను కొనియాడారు. ఈకార్యక్రమంలో పంచాయతీల విస్తరణ అధికారి వెంకట రమణ, పి ఆర్ ఏ ఈ కె. శ్రీ రామచంద్రారెడ్డి, యం ఈ ఓ యస్. సూరజన్, మండల పరిషత్ సిబ్బంది,యన్ ఆర్ ఇ జి యస్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న తెదేపా అభిమాని

విశాలాంధ్ర -కొవ్వూరు : తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో హర్షిస్తూ కొవ్వూరుకు చెందిన చంద్రబాబు అభిమాని కాగిత రఘు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద తల నీలాలు నుంచి ముక్కు చెల్లించుకున్నాడు.. 52 రోజులు క్రితం చంద్రబాబు అరెస్టు అయినప్పుడు అభిమాని రఘు చంద్రబాబు నాయుడు సురక్షితంగా జైలు నుండి బయటకు వస్తే తలనీలాలు సమర్పిస్తానని మొక్కుకున్నాడు.. ఈ సందర్భంగా చంద్రబాబు అభిమాని కాగిత రఘు మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు అరెస్ట్ అయినప్పుడు ప్రతి ఒక్కరూ బెయిల్ మీద సురక్షితంగా ఆయన బయటకు రావాలని కోరుకున్నారని, అందులో భాగంగానే తలనీలాలు ఇస్తానని మొక్కుకున్నట్లు రఘు అన్నారు.. కొవ్వూరు నియోజకవర్గం లో అనేక నిరసన కార్యక్రమాలుద్విసభ్య కమిటీ నాయకులు జొన్నలగడ్డ చౌదరి, కంట మని రామకృష్ణ ఆధ్వర్యంలో చేశామని రఘు అన్నారు.

టిడిపి జనసేన సంయుక్తంగా ప్రచారం

విశాలాంధ్ర - కరప : కరప మండలం కొంగుడు గ్రామంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి, జనసేన పిఎసి సభ్యులు పంతం నానాజీ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ జనసేన తెలుగుదేశం పార్టీ ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజలకు తెలియజేశారు. వచ్చే 2024 ఎన్నికలలో జనసేన టిడిపి పార్టీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించి రాష్ట్రంలో వైసీపీ పాలనకు చమర గీతం పాడాలని పిల్లి సత్యనారాయణమూర్తి, పంతం నానాజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆట్ల గోవిందు, కోటగిరి మహేంద్ర బాబు, గండి వెంకటేశ్వరరావు, పులపకూర శుభ మహేష్, పంపన కన్నారావు, గుళ్ళపల్లి శ్రీనివాసరావు, ప్రకాష్ గౌడ్, బొజ్జ భవాని, జనసేన నాయకులు బందారు మురళి, నక్క గోవిందు, వీరబాబు వీరభద్రరావు, ముత్యాలరావు, శ్రీనివాసరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

నాని, ఆర్జీవీ, సంయుక్త మీనన్‌లతో జీ తెలుగు
కుటుంబం అవార్డ్స్ పార్ట్-2

విశాలాంధ్ర-రాజమండ్రి: తెలుగు ప్రేక్షకులకు అంతులేని వినోదాన్ని అందించేందుకు ఎల్లవేళలా కృషిచేసే ఛానల్ జీ తెలుగు. నటీనటుల ప్రతిభను ప్రోత్సహించేందుకు 2023 సంవత్సరానికి గానూ ఇటీవలే టాలీవుడ్ ప్రముఖ తారలు, బుల్లితెర నటీనటుల మధ్య అంగరంగ వైభవంగా జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ ఉత్సవాన్ని నిర్వహించిందని ఆ ఛానెల్ ప్రతినిధి చెప్పారు. మహిళల ప్రాధాన్యత ఇనుమడించేలా ప్రత్యేకమైన పింక్ కార్పెట్, జీ తెలుగు కుటుంబం అవార్డుల ప్రధానోత్సవం పార్ట్- 1 ప్రేక్షకులను అలరించిందని, ఇక, ఈ మెగా ఈవెంట్ పార్ట్-2ను ఈ ఆదివారం ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సిద్ధమైందన్నారు. ఆకట్టుకునే ప్రదర్శనలు, హృదయాన్ని తాకే క్షణాలు, మరపురాని అనుభవాలతో ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ గ్రాండ్ ఎంట్రీతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ఎనర్జిటిక్ యాంకర్స్ అయిన ప్రదీప్ మాచిరాజు-రష్మీ గౌతమ్ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారన్నారు. ఈ నెల 5 ఆదివారం సాయంత్రం 6 గంటలకు జీ తెలుగులో ప్రసారం అవుతుందని చెప్పారు.

బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ

విశాలాంధ్ర - పిఠాపురం : మాజీ ఎమ్మెల్యే వర్మ ఆధ్వర్యంలో మండలంలోని విరవాడ గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ, బాబుతో నేను మరియు మన ఇంటికి మన వర్మ - ఆశీర్వదిద్దాం కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం కక్ష పూరిత రాజకీయాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అధికారుల్లో ఉండగా ఈ విరవాడ గ్రామంలో 5 కోట్ల రూపాయలతో తాను అభివృద్ధి చేయడం జరిగిందని అన్నారు. అయితే ఇక్కడ ఇంకా 78 లక్షల రూపాయలతో వెయ్యవలసిన రోడ్లు పెండింగ్లో ఉండిపోయాయని, తమ ప్రభుత్వంలో విడుదల చేసిన నిధులు ఎక్కడికి మళ్ళించారో గ్రామ ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సుఖమల్ల గంగాధర్ రావు, బర్ల అప్పారావు, గ్రామ తెలుగుదేశం పార్టీ శ్రేణులు కోలా చిన్న, కోలా రాజు, కంద శేషగిరి, కంద అప్పారావు, నాము శ్రీను, రామారావు తదితరులు పాల్గొన్నారు.